ప్రజాశక్తి

గురువారం 17 నవంబర్ 2022 8 పేజీలు

గుంటూరు పల్నాడు

కౌల్దార్లకు రుణాలు అరకొరే

- సిసిఆర్‌సి ఉన్నా సుముఖత చూపని బ్యాంకర్లు
- పల్నాడు జిల్లాలో 3378 మందికి రూ.13.53 కోట్లు
- గుంటూరు జిల్లాలో 9 వేల మందికి రూ.31.07 కోట్లు
- రుణ మాఫీ అమలవ్వక 20 వేల మందికి దక్కని అవకాశం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వ్యవసాయంలో కీలకమైన కౌలురైతులకు ఈ ఖరీఫ్‌లో పంట రుణాల మంజూరులో బ్యాంకులు మొండిచేయి చూపాయి. గుంటూరు జిల్లాలో 37,218 మంది కౌలు రైతులు ఉన్నట్టు అధికారులు అంచనా వేయగా 24,210 మందికి పంట సాగు ధ్రువపత్రాలు (సిసిఆర్‌సి)లు అందించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ఖరీఫ్‌లో కౌలు రైతులకు రూ.297.80 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా కేవలం 9 వేల మందికే రూ.31.07 కోట్ల రుణాలిచ్చారు. పల్నాడు జిల్లాలో 33,172 మందికి సిసిఆర్‌సిలు ఇవ్వాలని లక్ష్యం కాగా దానికి మించి 39,973 మందికి సిసిఆర్‌సిలు జారీ చేశారు. అయితే వీరిలో 3,378 మందికే (10 శాతానికి తక్కువగా) రూ.13.53 కోట్ల రుణాలిచ్చారు.

గుంటూరు, పల్నాడు జిల్లాలో లక్షన్నర మంది కౌలు రైతులున్నట్టు అంచనా కాగా అధికారులు మాత్రం 70 వేల మందే ఉన్నట్లు అంచనా వేశారు. వీరిలో 64 వేలమందికి సిసిఆర్‌సిలు ఇచ్చినా రుణాల ఇప్పించడంలో వ్యవసాయశాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపలేదు. గతంలో తీసుకున్న రుణాలు చెల్లించలేదని బ్యాంకర్లు సాకుగా చూపుతున్నారు. 2014లో టిడిపి ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని పూర్తిస్థాయిలో చేయకపోవడం వల్ల అప్పట్లో 20 వేల మంది వరకు బకాయిలు పడ్డారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని భావించినా చేయకపోవడం వల్ల వీరు బకాయిలు పడటంతో రెండేళ్లుగా రుణాలివ్వడం లేదు. గతంలో కౌలు రైతులకు గ్రూపు రుణాలు ఇచ్చే వారు. ఇప్పుడు అవి కూడా ఇవ్వడం లేదు. దీంతో కౌలు రైతులు పెట్టుబడి కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్నారు.

ఒకవైపు కౌలు, మరో వైపు అధిక వడ్డీలు చెల్లించలేక, పంటకు మద్దతు ధరలు దక్కక గత రెండేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అనేక మంది కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కొంత మందికి సిసిఆర్‌సి లేకపోవడం వల్ల కౌల్దార్లు ప్రభుత్వం నుంచి ఎటువంటి సదుపాయాలూ పొందలేకపోతున్నారు. ప్రధానంగా రైతు భరోసా ద్వారా రూ.13,500, ఈ-క్రాప్ బుకింగ్, బీమా సదుపాయమూ దక్కడం లేదు. 2011లో ఉన్న కౌల్దారు చట్టం ప్రకారం భూ యజమానులతో 2లో

ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

మరోకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - తాడికొండ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం పాలవగా మరొక విద్యార్థి పరిస్థితి విషయమంగా ఉంది. తాడికొండ అడ్డరోడ్డు - పొన్నెకల్లు మధ్య బుధవారం రాత్రి వాటిల్లిన ప్రమాదంపై వివరాల ప్రకారం.. మండలంలోని పొన్నెకల్లు గ్రామానికి చెందిన నామాల సాయికుమార్ (22), 2లో

ఘటనా స్థలిలో మృతదేహాలు

రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- రైతు సంఘాల సమావేశంలో నాయకులు
- 19న సదస్సును జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు గుంటూరులో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న సందర్భంగా 19వ తేదీన గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'వ్యవసాయ రంగం సంక్షోభం-మద్దతు ధరల చట్టం-ప్రభుత్వ విధానాలు' అంశంపై రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు కోరారు. వివిధ రైతు సంఘాల సమావేశం స్థానిక రైతు సంఘం 2లో

మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : జెసి

ప్రజాశక్తి-గుంటూరు

పిసిపిఎన్‌డిటి యాక్ట్‌పై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ కమిటీ, జిల్లా సలహా కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని డిఆర్‌సి సమావేశ మందిరంలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమయాఖాన్ మాట్లాడుతూ జిల్లాలో రిజిస్ట్రేషన్ లేకుండా స్కానింగ్ సెంటర్ నడపరాదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడుతున్న స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు 2లో

ఓటు నమోదుపై విస్తృత ప్రచారం

అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా పరిశీలకుల సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యేలా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని ఇంటర్ మీడియట్ విద్యా కమిషనర్, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎం.వి.శేషగిరిబాబు సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2023పై శేషగిరిబాబు, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివ నారాయణశర్మతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇఆర్వోలతో సమావేశం కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1879 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని తెలిపారు. తెనాలి, మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో లింగ 2లో

మాట్లాడుతున్న శేషగిరిబాబు

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అట్రాసిటీ కేసులో అరెస్టులేవి?

- పెత్తందార్లను వెంటనే అరెస్టు చేయాలి
- తహశీల్దార్‌కు దళిత, ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి - అమరావతి

అత్తులూరు దళిత మహిళా సర్పంచ్ ఫిర్యాదుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదవగా ఈ కేసులో నిందితులుగా ఉన్న పెత్తందార్లను ఇంకా అరెస్టు చేయలేదని దళిత, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. వారిని తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ తహశీల్దార్ కె.విజయశ్రీకి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ప్రజాసంఘాల మండల కన్వీనర్ బి.సూరిబాబు మాట్లాడుతూ అత్తులూరు సర్పంచ్ బంకా సరోజినిని గ్రామానికి చెందిన పెత్తందార్లు మదమంచి సతీష్, సింగమనేని నరసయ్య, పంచాయతీ మాజీ సెక్రటరీ బిక్కి సుధాకర్, స్వీపర్ వెంకటకృష్ణ కులం పేరుతో దూషించారని, ఆమె విధులకు ఆటంకం కలిగించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ సర్పంచ్ భాగస్వామి కాకుండా అడ్డు పడుతున్నారని చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి బాధిత సర్పంచ్ ఫిర్యాదు చేశారని తెలిపారు. పెత్తందార్లపై కేసు నమోదు కోసం దళిత, ప్రజా సంఘాలతో కలిసి సర్పంచ్ నెలరోజులపాటు 2లో

అంగన్‌వాడీ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

పోస్టర్ ఆవిష్కరణలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో ఈనెల 25-27 తేదీల్లో నిర్వహించే అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర 10వ మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు మహాసభ పోస్టర్‌ను పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో జిల్లా నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం సుబ్బరామ్మ మాట్లాడుతూ ఐసిడిఎస్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిధులు కుదిస్తూ అంగన్‌వాడీలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఐసిడిఎస్ పరిరక్షణ, ఉద్యోగ భద్రత, నూతన విధానం అమలు, పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై మహాసభలో చర్చించి, నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మహాసభలో జాతీయ కార్యదర్శి కె.వరలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొంటారని, మహాసభ జయప్రదానికి జిల్లాలోని ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పి.దీప్తి మనోజ, నాయకులు బుజ్జి, రాధా, వెంకాయమ్మ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుబ్బరావమ్మ తదితరులు

ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

నూతక్కి నాగమల్లేశ్వరరావు (22), తాళ్లూరి అజయ్‌కుమార్ ముగ్గురూ స్నేహితులు సాయికుమార్ బీటెక్ చదువుతుండగా, నాగమల్లేశ్వరరావు డిగ్రీ చదువుతున్నారు. ముగ్గురూ కలిసి బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తాడికొండ అడ్డరోడ్డు వైపు వస్తున్నారు. గ్రామం వెలుపల కొద్దిదూరం రాగానే ఎదురుగా వచ్చిన మరో వాహనం వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిం వెళ్లిపోయింది. 9-9.30 గంటలప్పుడు అటుగా వెళ్లున్న ప్రమాదానికి గురైన వాహనాన్ని గమనించి అటుగా పరిశీలించగా ముగ్గురూ తలోచోట పడి ఉన్నారు. వెంటనే 108, పోలీసులకు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి చూసి సాయికుమార్, నాగమల్లేశ్వరరావు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. అజయ్‌కుమార్‌కూ తీవ్ర గాయాలవడంతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. మరో ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఘటనా స్థలిని తాడికొండ ఎస్ఐ నరసింహులు పరిశీలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

అట్రాసిటీ కేసులో అరెస్టులేవి?

(మొదటి పేజీ తరువాయి)

పోరాడాల్సి వచ్చిందని, గత నెల 30న కేసు నమోదు చేసినా నిందితుల్ని మాత్రం ఇంకా అరెస్టు చేయలేదని అభ్యంతరం చెప్పారు. ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అండతోనే పెత్తందార్లు అరెస్టవకుండా తప్పించుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలపై కేసులు పెడితే 24 గంటల్లో అరెస్టు చేసి జైలుకు పంపే పోలీసులు దళిత సర్పంచ్ పెట్టిన కేసులో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కెవిపిఎస్ మండల కార్యదర్శి ఎస్.రాజకుమార్, కె.పాములు, కె.వెంకటేశ్వర్లు, కె.ప్రసాదు, షేక్ కరీమ్, సయ్యద్ మోహిద్దీన్‌వలి పాల్గొన్నారు.

కౌల్దార్లకు రుణాలు అరకొరే

(మొదటి పేజీ తరువాయి)

సంబంధం లేకుండా కౌలు రైతులను రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు గుర్తించే వారు. గ్రామ సభల్లో కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు (ఎల్ఇసి) జారీ చేసేవారు. తద్వారా బ్యాంకుల నుంచి రుణాలు, రాయితీపై విత్తనాలు, పంట ఉత్పత్తుల అమ్మకానికి ఈ-క్రాప్ బుకింగ్ వంటి సదుపాయాలు వర్తించేవి. వైసిపి అధికారంలోకి వచ్చాక కొత్త చట్టం తేవడం, దీని ప్రకారం సిసిఆర్‌సిలు పొందడానికి భూ యజమాని అంగీకారం, సంతకం అవసరమనే నిబంధన వల్ల ఎక్కువ మంది సిసిఆర్‌సిలు పొందలేక, ప్రభుత్వ ప్రోత్సాహాలు అందగా పెట్టుబడుల కోసం సతమతమవుతున్నారు. పంటల బీమా సదుపాయం కూడా భూ యజమాని ఖాతాల్లో జమవుతోందని, కౌలు రైతులు వాపోతున్నారు. కొంతమంది తమకు ఈ సొమ్ము ఇస్తున్నా కొంత మంది ఇవ్వడంలేదని కౌలురైతులు చెబుతున్నారు.

టిఎన్‌టియుసి నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి -తెనాలి రూరల్

మాట్లాడుతున్న సాంబిరెడ్డి

తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కమిషన్ మర్చంట్స్ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం స్థానిక గంగానమ్మ పేట కార్యాలయంలో జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నర్రా సాంబయ్య, కన్నెగంటి మురళీకృష్ణ, గౌరవాధ్యక్షునిగా అన్నవరపు వేణు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి వివిధ కార్మిక సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, జట్టి రేణుక, గడవర్తి సుబ్బయ్య, పెండ్యాల వెంకటరావు, సిఐటియు నాయకులు కే బాబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

విజ్ఞాన సంపద కేంద్రం గ్రంథాలయం

చిలకలూరిపేట

మేడికొండూరు

సత్తెనపల్లి

ప్రజాశక్తి-చిలకలూరిపేట: పట్నంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ దాసరి చిట్టిబాబు అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ గ్రంధాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాలలో శతక పద్యాల పోటీ నిర్వహించారు. ఉపాధ్యక్షులు గెరా యాకోబు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అద్యక్షులు డా.పి.వి.సుబ్బారావు, చుక్కా విన్సెంట్ పాల్, దార్ల బుజ్జిబా బు, గ్రంథాలయ ఇంఛార్జ్ అధికారి నాగుల్ మెరా వలి వీర్రాజు, సరోజిని, సాంబిరెడ్డి, శ్రీనివాస రెడ్డి వితదితరులు పాల్గొన్నారు.క్రోసూరు: క్రోసూరు గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ పాఠశాల నుండి 140 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారిని వై .వీరాంజమ్మ గతంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఐ. వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం,రంగనాథన్‌ల గురించి విద్యార్థులకు తెలియజేశారు.ఉపాధ్యాయులు షేక్. శిలార్ష, విజయ్ కుమారి, పూర్ణ, షణ్ముఖ ,ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.మేడికొండూరు: విజ్ఞాన సంపద కేంద్రం గ్రంథాలయం అని అలాంటి గ్రంథాలయాల సౌకర్యాలను విద్యార్థులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయప్రద అన్నారు. గ్రంథాలయ 55వ వారోత్సవాలలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ హై స్కూల్లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సూపర్వైజర్ సుధారాణి ,అధ్యాపక సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులుపాల్గొన్నారు.

పెదకూరపాడు :జిల్లా గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా బుధవారం పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు నిర్వహణలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరాంజనేయరావు, గ్రంథాలయ అధికారి కొర్రపాటి వాణి పాల్గొన్నారు. **తాడేపల్లి :** గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తకపఠనంపై ఆసక్తి పెంచుకోవాల్సిన అవసరంపై బుధవారం జూనియర్స్, సీనియర్స్ విభాగంలో తాడేపల్లి శాఖాగ్రంథాలయంలో వ్యాసరచనపోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుండి 110మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు గ్రంథాలయ అధికారి ఎస్‌కె.నాగూర్‌బాషా , ఉపాధ్యాయులు గంగాభవాని, రాధిక, శ్రీవల్లి, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.**ప్రత్తిపాడు:** పత్తిపాడు శాఖ గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ శాఖ అధికారి బి అరుణ తెలిపారు. వీటితో పాటు ఎంపిపి హెచ్ఈ స్కూల్‌లో జూనియర్ స్థాయిలో మ్యూజికల్ చైర్ పోటీలు కూడ నిర్వహించినట్లు ఆమె తెలిపారు ఇందులో ప్రతిక్, దుర్గగౌతమి, ఎస్‌కె. షేక్ బషీరా, గోపి,నికితలు నిలిచివిజేతలుగా బహుమతులు సాధించారు. ఉపాధ్యాయులు మణిరత్నం, పుణ్యవతి, ఇంద్రావతి,బేగం, అపర్ణ, పాల్గొన్నారు. **సత్తెనపల్లి:** స్థానిక వైయస్సార్ శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన,వకృత్వ పోటీలు జరిగాయి.ఈ కార్యక్రమంలో స్థానిక కేంద్రీయ విద్యాలయం, గర్ల్స్ హై స్కూల్ విద్యార్థులు,రిటైర్డ్ లెక్చరర్ ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి,ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.**పెదనందిపాడు:** పెదనందిపాడు శాఖ గ్రంథాలయంలో మండల స్థాయిలో పాఠశాల విద్యార్థులకు ప్రకృతి అంశాలు, జాతీయ నాయకుల పై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అశోక ఉన్నత పాఠశాల, నంది పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ నిర్వహకురాలు పి.సుభాషిని, న్యాయ నిర్ణీత,విశ్రాంత ఉపాధ్యాయులు గుగ్గిలం సాయిబాబు ,ఉపాధ్యాయులు ఎం సుకన్య, డి అనూష, కే మంజుల, పాల్గొన్నారు. **నరసరావుపేట:** పట్టణంలోని పల్నాడు రోడ్‌లో గల గ్రంథాలయంలో వారోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ భారతి సంస్థ అధ్యక్షులు రత్నాకరం రాము , నరసరావుపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు రత్నాకరం వరప్రసాద్, వ్యవస్థాపకులు అయ్యంకి వెంకటరామయ్య, డాక్టర్ ఎస్సార్ రంగనాథన్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వర్ణ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వకృత్వం పోటీలు నిర్వహించారు.యడ్లపాటి రాధ, ముప్పాళ్ళ కాంచన శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖా గ్రంథాలయాలలో బుధవారం విద్యార్థులకు ఆటలుపోటీలు నిర్వహించటం జరిగింది. విద్యార్థులకు పరుగుపందెం, మ్యూజికల్ చైర్ వంటి ఆటలపోటీలను నిర్వహించారు. సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో జరిగిన ఆటలపోటీలను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రజామూర్తి పరిశీలించారు. వజ్రాల ప్రవీణ్ కుమార్, సుబ్బారావు, గ్రామీణ గ్రంథాలయ నిర్వహకులు పచ్చవ సత్యనారాయణ, ఎస్. నరసింహారావు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో సంఘం మండల కార్యదర్శి టి.ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని, వీటి అమలు కోసం మార్చిలో 500 రైతు సంఘాల ఆధ్వర్యంలో మరో ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతు కూలి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.భాస్కరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, విద్యుత్ మీటర్ల ఏర్పాటు ద్వారా వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేందుకు పూనుకున్నాయని మండిపడ్డారు. రైతు సంఘం జిల్లా నాయకులు వి.భారతి మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరలు ఇవ్వకుండా రైతులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. టిడిపి రైతు విభాగం నాయకులు టి.పార్థసారథి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు సరిగా పనిచేయడం లేదని, రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శులు జెవి రాఘవులు, ఎస్ఎస్.చెంగయ్య మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం యత్నిస్తోందని, వ్యవసాయం చేయలేని దుస్థితికి రైతులను నెడుతున్నాయని విమర్శించారు. జనసేన రైతు విభాగం నాయకులు కె.సుందరయ్య మాట్లాడుతూ రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు కె.వెంకటేశ్వరరావు, రైతు కూలి సంఘం నాయకులు కె.కోటేశ్వరరావు, ఆదినారాయణ, టిడిపి రైతు సంఘం నాయకులు జి.దుర్గారావు, జి.రాఘవ, రైతు సంఘం నాయకులు బి.జానారెడ్డి, ఎ.సాంబిరెడ్డి, సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

మేధావులు మౌనం వీడండి

జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమాజంలోని సమస్యల పరిష్కారం కోసం మేధావులు మౌనం వీడి ప్రజలను జాగృతం చేయటానికి కృషి చేయాలని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. బుధవారం అధ్యాపక ఉద్యమ నేత ఎం.జె మాణిక్యరావు 15వ వర్ధంతి సందర్భంగా గుంటూరులోని ఏసీ కళాశాల వద్దగల ఎం.జె మాణిక్యరావు విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రసంగిస్తూ తన జీవితమంతా ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యల పరిష్కారం కోసం కృషిచేసి సమాజంలో వారికి సమూల గౌరవాన్ని కల్పించిన మహానేత ఎం.జే మాణిక్యరావు అని కొనియాడారు. ఏసీ కళాశాల ప్రిన్సిపల్ కొమ్మాలపాటి మోజెష్ ప్రసంగిస్తూ తెలుగు రాష్ట్రాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు గౌరవప్రదమైన జీవితాన్ని పొందటానికి ఎం.జే మాణిక్యరావు కృషి ఫలితమేనని తెలిపారు.జూనియర్ కళాశాల ఉద్యమ నేత ఎం.కైలాష్ నాథ్ తదితరులు ప్రసంగించి అనంతరం పూలమాలతో నివాళులర్పించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : జెసి

(మొదటి పేజీ తరువాయి)

తప్పవన్నారు. జాయింట్ కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అబార్షన్లను ప్రతినెలా పర్యవేక్షించాలని, డెకాయ్ ఆపరేషన్లు తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు. స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి, చట్టం అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న, ఎక్కువగా ఉన్న మండలాలను గుర్తించి, ఆరోగ్య కార్యకర్తల ద్వారా సర్వే నిర్వహించి, కారణాలు విశ్లేషించి, నివేదించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. అబార్షన్స్ ఎక్కువగా జరుగుతున్న ప్రైవేటు ఆసుపత్రులను గుర్తించి, వాటిపై సమగ్ర విశ్లేషణతో నివేదించాలన్నారు. ఇదిలా ఉండగా 18 కొత్త కేంద్రాలు, 18 రెన్యువల్స్ అప్లికేషన్లకు అనుమతులు మంజూరు చేశారు. కమిటీ సభ్యులు డాక్టర్ ఇందిర, డాక్టర్ రామ్మోహనరావు, డాక్టర్ జగదీష్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, సీడ్స్ ప్రతినిధి రాణి పాల్గొన్నారు.

ఓటు నమోదుపై విస్తృత ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

నిష్పత్తి, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలో ఈపీ (ఎలక్టోరల్ పాపులేషన్) నిష్పత్తి తక్కువుగా ఉన్నాయని, పొన్నూరు, తాడికొండ, తెనాలిలో ఈపీ రేషియో ఎక్కువుగా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వీటిపై ఈఆర్వోలు, ఏఈర్వోలు ప్రత్యేక దృష్టి పెట్టి కారణాలు విశ్లేషించి బీఎల్ఓ స్థాయి నుంచి సర్వే చేసి తుది ఓటర్ల జాబితా సరిగా రూపొందిస్తామని చెప్పారు. శేషగిరిబాబు మాట్లాడుతూ ఓటర్ల జాబితాను రూపొందించడంలో ఉత్పన్నమయ్యే అంశాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో 66, 67 పోలింగ్ బూత్‌లను మార్పు చేయటం వలన ఎక్కువ మంది ఓటర్లు పోలింగ్ బూత్ కోసం దాదాపు రెండు కిలో మీటర్లు నడవాల్సి వస్తుందని, గతంలో ఉన్న ప్రాంతంలోనే పోలింగ్ బూత్‌ను ఉంచాలని కోరారు. తాడికొండలో ఈపీ రేషియో ఎక్కువగా వుందని, ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. జీరో డోర్ నంబర్‌తో ఓట్లు నమోదయ్యాయన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి ఓట్లు వున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరతనగండ్ల వాసు కోరారు. ఒక నియోజకవర్గం నుండి మరొక నియోజకవర్గానికి ఓటు హక్కు బదలాయించే ప్రక్రియ సరిగా కొనసాగట్లేదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు తాడికొండ నియోజకవర్గ పరిధిలో ఇంటి స్థలాలు కేటాయించారని, ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారి ఓట్లను తాడికొండ నియోజకవర్గంలో నమోదు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత, డిప్యూటీ కలెక్టర్లు సాయిశ్రీ, మోవిడి వాణి, జిఎంసి అడిషనల్ కమీషనర్ పి.రోజా, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్ ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నూజెండ్ల

మండలంలోని తెల్లబాడు గ్రామ శివారులో మంగళవారం రాత్రి బైక్ - ట్రాక్టర్ ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయా లయ్యాయి. నకరికల్లు మండలం దేచారం గ్రామస్తుడు ఓర్సు గోపి, కురిచేడు మండలం వెంగాయ పాలెం బీసీ కాలనీకి చెందిన మక్కెళ్ళ రమేష్‌లు బైక్‌పై పెదకంచెర్ల నుండి కంభంపాడు వైపు వెళుతున్నారు. తెల్లబాడు గ్రామ శివారులో జామాయిల్ లోడ్ తో వస్తున్న ట్రాక్టర్, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరు గైన వైద్యం కోసం నరస రావుపేట ప్రభుత్వ వైద్యశాలకు పంపించినట్లు వైద్యులు తెలిపారు.

'ఫ్యామిలి ఫిజిషియన్'ను వినియోగించుకోండి: ఎంపిపి

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ఎంపిపి మేకల హనుమంతరావు బుధవారం ప్రారంభించారు. మండలంలోని ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు జరిగే ఫ్యామిలి ఫిజిషియన్ కార్య క్రమాన్ని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి :	31,571
మిర్చి ఎగుమతి :	33,267
మిర్చి నిల్వ :	9,669

మిర్చి ధరలు

	రూపాయలలో
334	11,500 - 28,000
నెం.5	25,000- 25,000
273	22,000 - 23,800
341	10,000 - 28,500
4884	19,000 - 19,000
సూపర్ 10	18,000 - 27,500
నాన్ ఎసి	
తేజ	10,000- 24,000
బడిగి	16,100 - 28,000
దేవనూరు డీలక్స్	18,000 - 27,000
తాలుకాయలు	4,500 - 13,500
ఎసి	
334	8,000 - 27,000
నెం.5	23,500 - 24,500
341	11,000 - 27,000
4884	18,500 - 22,500
తేజ	9,000 - 23,000
బడిగి	21,000 - 27,000
దేవనూరు డీలక్స్	20,000 - 22,500
తాలుకాయలు	4,200- 12,000

పట్టుబడ్డ మద్యం సీసాలు ధ్వంసం

ప్రజాశక్తి -మేడికొండూరు

మండల పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడ్డ అక్రమ మద్యం సీసాలను బుధవారం ధ్వంసం చేశారు. డీఎస్పీ పోతురాజు సమక్షంలో మేడికొండూరు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో వీటిని ధ్వంసం చేసినట్లు మేడికొండూరు సీఐ ఆల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో అక్ర మంగా మద్యం అమ్ముతున్న వారిని అరెస్టు చేసినప్పుడు వారి వద్ద ఈ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.పోలీస్ ఉన్నతాధి. కారుల ఆదేశాల మేరకు పేరేచర్ల ఎన్ఎస్పి కెనాల్ వద్ద

55 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎస్సై కోటేశ్వరరావు,హెడ్ కానిస్టేబుల్ జానీ, ఇమ్రాన్, హోంగార్డు జానీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేను చర్చకు పిలిచే స్థాయి జూలకంటికి లేదు'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రాంరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని చర్చ కు రమ్మని పిలిచే అంత స్థాయి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూల కంటి బ్రహ్మారెడ్డికి లేదంటూ ఆయనపై వైసిపి రాష్ట్ర యువజన కార్య దర్శి పిన్నెల్లి వెంకట్రాంరెడ్డి నిప్పులు చెరిగారు. స్థానిక ఎమ్మెల్యే కార్యా లయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాచర్లలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, దోపిడీ చేస్తున్నారని, ఈ విషయమై ఎమ్మెల్యే పిన్నెల్లి చర్చకు రావా లంటూ బ్రహ్మారెడ్డి చేసిన వ్యాఖ్యలపై వెంకట్రామిరెడ్డి మండ పడ్డారు. 'మాచేతిలో రెండుసార్లు ఓటమిపాలయ్యావు. కౌన్సిలర్‌గా కూడా గెలిచిన చరిత్ర కూడా లేదు. నీవు మమ్మల్ని చర్చకు రమ్మని పిలుస్తావా..' అంటూ విరుచుకుపడ్డ వెంకట్రాంరెడ్డి, బ్రహ్మారెడ్డి ఒళ్ళు దగ్గర పెట్టుకొని ఉండాలని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో వచ్చి రెండు నెలలు పని చేసి ఖర్చుల కోసం కొంత డబ్బులు తీసు కొని పోయే బ్రహ్మారెడ్డి, ఈసారి యరపతినేని మాటలు విని ఎమ్మెల్యే టికెట్ వస్తుం దనే ఆశతో వచ్చారని విమర్శించారు. టిక్కెట్ వస్తే ఆయన పోటీ చేస్తారని, లేకపోతే అయిన ఖర్చులకు డబ్బులు తీసు కుని పోతారంటూ ఆ సంగతి అందరికీ తెలిసిందేనంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బ్రహ్మారెడ్డి తల్లి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన ఏడు మర్డర్ల వల్ల ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయో అందరికీ తెలుసని చెప్పుకొచ్చారు.తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్త లకు సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారంటూ బ్రహ్మారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వాలంటీర్ వ్యవస్థను బ్రహ్మ రెడ్డి కించపరుస్తూ మాట్లాడడం సబబు కాదన్నారు. ఈ సందర్భంగా మాచర్ల అభివృద్ధిపై వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గా కిషోర్, వ్యవ సాయ శాఖ అభివృద్ధి మండల కమిటీ జిల్లా చైర్మన్ సాయి మార్కం డేయరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఘురాంరెడ్డి పి.నరసింహా రావు, ఎంపిపి బి.శ్రీనివాసరావు, దుర్గి,వెల్దుర్తి, రెంటచింతల ఎంపి పిలు పాల్గొన్నారు.

దారిదోపిడీలకు పాల్పడుతున్న యువకులు అరెస్టు

ప్రజాశక్తి - కొల్లిపర

చెడు వ్యసనాలకు బానిసలై దారి దోపిడీలకు పాల్ప డుతున్న నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్ రవీంద్రారెడ్డి బుధవారం తెలిపారు. మండల కేంద్రమైన కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాఠశాల అనంతరం ఇంటికి వెళ్లే క్రమంలో వారిపై దాడి చేసి రూ.1,700 నగదు దోచుకున్నట్లు విద్యా ర్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితులైన తుమాటి శ్యాం కుమార్, ఎం.రాజ్ కుమార్ , ఆనంద్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాల్గో నింది తుడు పరారైనట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టు కు హాజరు పరిచినట్లు ఎస్సై వివరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేకమైన పనులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్ప డితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బర్నబాసు కేసును ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుగా మార్చాలి

దళిత ఆత్మ రక్షణ సభలో బర్నా బాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విసికె పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎంపి తిరుమావళవన్ తదితరులు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ఇటీవల హత్యకు గురైన దళితుడు అంజి బర్నబాసు కుటుంబానికి తాము అండగా ఉంటామని విసికె పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎంపి తిరుమావళవన్ పేర్కొన్నారు. విముక్తి చిరుతల కక్షి పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రేపల్లె బస్టాండ్ లో దళిత ఆత్మ రక్షణ సభ ఏర్పాటు చేశారు. అంజి బర్నా బాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వి సి కె పార్టీ ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో తిరుమావళవన్ మాట్లాడుతూ చుండూరు కారంచేడులలో దళితులపై జరిగిన దమన కాండపై తాను పోరాటం చేశానన్నారు. బర్నబాసు హత్య తనని ఎంతో కలచివేసిందన్నారు. బర్నబాసు హత్య కేసు లోని ప్రధాన నిందితులను ఇంకా అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ హత్య కేసులోని ప్రధాన నింది తులకు ప్రభుత్వం అండగా ఉందేమోనన్న అనుమానం కలుగుతోం దన్నారు. బర్నబాసు కేసును ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుగా పరిగణిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహి స్తుందని, దీన్ని తాము ఖండిస్తు న్నా మన్నారు. దళి తులపై దేశ వ్యాప్తంగా జరుగు తున్న దాడులను తమ పార్టీ ఊరుకునేది లేద న్నారు.

అనంతరం సమత సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల చిట్టి బాబు, సమత సైనిక్ దళ్ రాష్ట్ర కార్య దర్శి గోపాల సుధాకర్ మాట్లాడారు.

సభలో దళిత సంఘాల నాయకులు పి.గుర వయ్య, మార్పు దీన రాజు, పార్టీ కార్యదర్శి శివ ప్రసాద్, జయ సుధ, వ ా ణి క్ ్య ర ా వు , ఎస్.చంటిబాబు, కృష్ణ పాల్గొన్నారు.

సవరణ

ది.16-11-22న ప్రజాశక్తి జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురించిన 'వార్డెన్‌పై చర్యలకు మంత్రి ఆదేశం' వార్తలో పొరపాటున బాలిక గురుకుల పాఠశాల హాస్టల్ వార్డెన్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వచ్చింది. దీనిని ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ వేముల బాలాంజలి పై చర్యలు తీసుకోవాలని సవరించి చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాము.

ఇట్లు

సంపాదకులు

లైసెన్స్డ్ ఇంజనీర్స్, బిల్డర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రజాశక్తి-గుంటూరు: లైసెన్స్డ్ ఇంజనీర్స్, బిల్డర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. బుధవారం సంపత్ నగర్ లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో లైసెన్స్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మేయర్‌ని వారి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. కన్స్ట్రక్షన్ నందు వారు ఎదుర్కొంటున్న సమ స్యలను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించి, ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమావేశంలో లైసెన్స్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.నాగ శ్రీనివాసరావు, సెక్రటరీ కృష్ణకాంత్, ట్రెజరర్ ఏ.యస్.ఆర్.కే రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తెనాలి

O.S. 338/2000 I.A. 1083/2013

బిట్వీన్
తాళ్ల శివమ్మ & ఇతరులు ...పిటీషనర్స్
మరియు
తాళ్ల వెంకటేశ్వర్లు & ఇతరులు ...రెస్పాండెంట్స్
To,
R22:తాడిబోయిన వెంకటరత్నం,S/o చినవెంకటేశ్వర్లు
R24:తాడిబోయిన పిచ్చయ్య, S/o చినవెంకటేశ్వర్లు
R25:తాడిబోయిన సాంబయ్య, S/o చినవెంకటేశ్వర్లు
కవిరాజు పార్క్ ఎదురు, నందులపేట, తెనాలి
...రెస్పాండెంట్స్ 22,24,25

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో రెస్పాండెంట్స్ 22,24,25లు కోర్టువారు పంపిన నోటీసులు తీసుకొనక త్రిప్పి పంపుచున్నందున, కోర్టువారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున రెస్పాండెంట్స్ 22,24,25లు ది.18-11-2022న ఉదయం 10-30గం॥లకు పై కోర్టునందు స్వయముగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కావలెను. లేనియెడల మీకు పరోక్షముగా ఫైనల్ డిక్రీ పిటీషన్ తీర్మానించబడును.

వాయిదా 18-11-2022

SB.శివ
పిటీషనర్లు తరపు అడ్వకేట్

స్థలం అమ్మకం కొరకు...

దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి గుంటూరు జిల్లా, గుంటూరు టౌన్, ఎపి హెచ్ బి కాలనీ, ఎం ఐ జి - 225, కాపురస్తుడు మామిడి ఏడుకొండలు కుమారుడు మామిడి సీతారామయ్య వద్ద....గుంటూరు జిల్లా తాడేపల్లి మున్సిపల్, సీతానగరం, గాంధీజీ ఆశ్రమం ,డోర్ నెంబర్ 13-354 కాపురస్తుడు దేవినేని వాసుదేవరావు కుమారుడు దేవినేని గోపినాథ్ కొనుగోలు చేసిన స్థలం అమ్మకం కొరకు...

స్వభావం.: గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ డివిజన్ ఇలాకా, తాడేపల్లి మండలం, ఉండవల్లి గ్రామ పంచాయితీ ఏరియా లో చేరిన, ఉండవల్లి గ్రామము తాలూకు సర్వే నెంబర్ 177/6, య.0.84 1/2 సెంట్లు మింజుమలే లోని,ఉండవల్లి గ్రామ డోర్ నెంబర్. 3-188 సమీపంలోని చ.గ.641.30 స్థిరాస్తి.

హద్దులు.:తూర్పు: సర్కారు వారి డొంక హద్దు
దక్షిణం: జమ్ముళ్లపూడి విజయకుమారి ఉరఫ్ రాచపూడి విజయకుమారి స్థలం.
పడమర: తుర్లపాటి శ్రీనివాసరావు వగైరాల భూమి హద్దు. ఉత్తరం: తమ్మా సాంబిరెడ్డి భూమి హద్దు.
ఈ హద్దులు మధ్య చ.గ.641.30 లేక చ.మీ.536.19 ల స్థలం.

సంప్రదించాల్సిన వారి పేరు..
దేవినేని గోపీనాథ్..
ఫోన్ నెంబర్..8074509950

ప్రకటన

మహారాజశ్రీ తెనాలి 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

O.S. No. 88/2016

Bettween :
Jonnakuti Siva Prasada Rao ... Plaintiff
Vs
Jonnakuti Sambasiva Rao & Others
.... Defendants
to,
Defendant No.4 : Tulra Rajyalakshmi D/o Sambasiva Rao, R/o Peravali Village, Vemuru Mandal, Guntur District.

Defendant No. 5 : Repalle Vani, D/o Sambasiva Rao, R/o Peravali Village, Vemuru Mandal, Guntur District.

పై నెంబరు గల దావాలో ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకోక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు ఈ వార్త ప్రకటన ద్వారా తెలియజేయమని ది.22-11-2022కి వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువాఇ ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల శ్రీ కోర్టువారిచే మీ పరోక్షంగా విచారించి తీర్మానింప బడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా : ది.22-11-2022

ఇట్లు
కొరిటాల నరశింహరావు,
వాది తఫు న్యాయవాది, తెనాలి.
సెల్ : 98486 11485

సైకిల్ పోలోలో ధనలక్ష్మి వ్యాయామ కాలేజీ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్లలో ఉన్న ధనలక్ష్మి వ్యాయామ కాలేజీ విద్యార్థిని డి.వెంకట నాగలక్ష్మి జాతీయస్థాయి సైకిల్ పోలో పోటీల్లో నాలుగో స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకట్రావు బుధవారం తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని డిఎస్ఎ స్టేడియంలో అక్టోబరు 23వ తేదీన జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వెంకటనాగలక్ష్మి ఈనెల 11-14 తేదీల్లో కర్ణాటక రాష్ట్రంలోని మాండ్యా జిల్లాలో జరిగిన రెండవ జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొన్నట్లు తెలిపారు. వెంకటనాగలక్ష్మిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మేదరమెట్ల రామా శేషగిరిరావు, అధ్యాపకులు వై.సురేష్, ఎం.సురేష్‌కుమార్, ఆర్.బలరాం నాయక్, ఎం.దాసు అభినందించారు.

మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలిస్తున్న జెసి

తెల్లబాడు ఎంపిపి పాఠశాలలో జెసి పరిశీలన

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని తెల్లబాడు మండల పరిషత్ పాఠశాలను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యతపై అడిగారు. పాఠశాలలో వసతుల గురించి వాకబు చేశారు. ఆయనవెంట తహశీల్దార్ మధుబాబు, ఎంపిడిఒ జిలానిబాష ఉన్నారు.

ఓటు హక్కు నమోదుపై విద్యార్థులకు వివరిస్తున్న ఆర్‌డిఒ

దేశాభివృద్ధికి ఓటు హక్కే పునాది

నలంద ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహనలో ఆర్‌డిఒ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఓటు హక్కు కోసం 18 ఏళ్లు నిండిన వారంతా దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డిఒ బిఎల్ఎన్ రాజకుమారి సూచించారు. మండలంలోని కంటెపూడి నలంద ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. ఓటు హక్కు దేశ సంక్షేమానికి, అభివృద్ధికి పునాది వంటిదని, అర్హులంతా నమోదు చేసుకోవడం ద్వారా ఇందులో భాగస్వాములు కావాలని సూచించారు. తహసీల్దార్ కె.నగేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని, ప్రలోభాలకు గురవకుండా నిజాయితీగా వినియోగించుకోవాలని చెప్పారు. సుపరిపాలన అందించే మంచి నాయకుణ్ణి ఎన్నుకునే అవకాశం ఓటు ద్వారా వస్తుందన్నారు. ఓటు హక్కు నమోదుతోపాటు తప్పుల సవరణ, మరో ప్రాంతానికి బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ శ్రీనివాసకుమార్, హెచ్ఒడి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో చదవండి..

- విగ్రహావిష్కరణలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్
- రీడింగ్‌రూం, లైబ్రెరీకి రూ.లక్ష ఇస్తామని ప్రకటన

విగ్రహాన్ని ఆవిష్కరణలో కలెక్టర్ శివశంకర్, నిర్వాహకులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణములో రూత్ డైక్‌మెన్ 11వ వార్డు కాలనీ వద్ద రీడింగ్ రూమ్ - లైబ్రరీ ఏర్పాటుకు రూ.లక్ష మంజూరు చేస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రకటించారు. ఈ కాలనీలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆల్ ఇండియా షెడ్యూల్ కులాల గౌరవాధ్యక్షులు ఎం.ముత్తన్న అధ్యక్షత వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, అందుకు స్ఫూర్తినిచ్చేలా అంబేద్కర్ విగ్రహాల వద్ద ఆయన పొందిన డిగ్రీలనూ పొందుపర్చాలని అన్నారు. 2600 ఏళ్ల కిందటే విద్య గొప్పతనాన్ని గౌతమ బుద్ధుడు చెప్పాడని, బుద్ధిజంలోని మూల సూత్రాలు నచ్చే ఆ మతాన్ని అంబేద్కర్ స్వీకరించారని తెలిపారు. చిన్ననాటి నుండే లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, విద్య ద్వారా ఏదైనా సాధ్యమేనని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం 'నవోదయం' కార్యక్రమాన్ని చేపట్టామని, ఐటిఐ లేదా ఫిట్టర్ చదివిన నిరుద్యోగులుంటే వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా స్థానిక మంత్రి, అధికారులతో చర్చిస్తామన్నారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన బొజ్జ సంధ్య అక్కన్నను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.సుజాత, మహర్షి, జగన్నాథరావు పాల్గొన్నారు.

లంపి స్కిన్ వ్యాధితో మరో దూడ మృతి

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులో నెల రోజులుగా ఆవు దూడలకు లంపి స్కిన్ వ్యాధి సోకి అవి చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. వారం కిందట వట్టిచర్ల శ్రీనివాసరెడ్డికి చెందిన ఆవు దూడ ఇదే వ్యాధితో మృతి చెందగా స్థానిక విద్యానగర్‌లోని పుల్లాభట్ల శ్రీనివాస్‌కు చెందిన ఆవు దూడ కూడా 10 రోజుల కిందట లంపి స్కిన్ వ్యాధి బారిన పడింది. దూడ శరీరం మొత్తం బెందులు, కాళ్ల వాపు వచ్చి నీళ్లు మేత లేకుండా ఉండటంతో జావా పోసి ఇచ్చామని, క్రోసూరు పశు వైద్యశాల గోపాలమిత్ర ప్రతిరోజూ వచ్చి ఒక ఇంజక్షన్ చేసి, టాబ్లెట్లువేస్తున్నా వ్యాధి అదుపవ్వక బుధవారం మృతి చెందనట్లు శ్రృనివాస్ తెలిపారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి వ్యాధి నివారణకు సమగ్ర చర్యలు తీసుకోవాలని పెంపకందార్లు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలివ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి లక్ష్మీశ్వరరెడ్డి - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మాట్లాడుతున్న అనుముల లక్ష్మీశ్వరరెడ్డి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహ మొత్తాన్ని రూ.6 లక్షలకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సంఘం మండల మహాసభ సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో మేడా వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన రూ.లక్షన్నర ఏ మూలకూ సరిపోవని, అందుకే లబ్ధిదారులకు ఇల్లు కట్టి పెడతామని ప్రభుత్వం ఇచ్చిన 3వ ఆప్షన్ నుంచి ప్రభుత్వం వైదొలిగిందని అన్నారు. భవన నిర్మాణ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం ఇల్లు పూర్తి కావాలంటే కనీసం రూ.6 లక్షలవుతాయన్నారు. పాకాలపాడులోని జగనన్న కాలనీలో 37 ఇళ్లు మంజూరవగా 10 మంది మాత్రమే స్లాబ్ వేసుకోగలిగారని, అదికూడా ప్రభుత్వం ఇచ్చిన బిల్లులతోపాటు సొంతంగా రూ.నాలుగైదు లక్షలు సమకూర్చుకోవడం వల్ల సాధ్యమైందని వివరించారు. రెక్కడితే గాని డొక్కాడని వ్యవసాయ కూలీలకు ఇళ్ల నిర్మాణం కలగా మారిందని ఆవేదన వెలిబుచ్చారు. మండలంలో 30 వేల మంది వ్యవసాయ కూలీలున్నారని, వీరి సమస్యలపై ఉద్యమిస్తామని చెప్పారు. సంఘం నాయకులు జె.భగత్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు ఇంకా ఇవ్వలేదని, ఆ ఇళ్ల కోసం చేసిన అప్పులతో లబ్ధిదార్లు సతమతం అవుతున్నారని తెలిపారు. డి.సుజాత మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక వ్యవసాయ కూలీల కుటుంబాల్లో మద్యం తాగుడు విపరీతంగా పెరిగిందని, అనేక కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని చెప్పారు. మద్యాన్ని నియంత్రించడంతోపాటు డీ ఎడిక్షన్ కేంద్రాలను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం 9 మందితో సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా మేడా వెంకటేశ్వర్లు, జమడ్లమూడి భగత్ ఎన్నికయ్యారు. మహాసభలో డి.గణేష్, జె.మరియదాసు, అనూష, ప్రశాంతి, టి.శ్రీనివాసరావు, ఎం.బ్రహ్మయ్య, కె.ముసలారెడ్డి, చిన ముసలారెడ్డి పాల్గొన్నారు.

అంజిరెడ్డి హాస్పిటల్స్ ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : పట్టణంలోని అంజిరెడ్డి హాస్పిటల్స్‌లో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. మెదడు, వెన్నుముక సర్జరీలు, పిట్స్, పక్షవాతం, నరాల బలహీనత, మెడనొప్పి, తిమ్మిర్లు, నరాల నొప్పులు మొదలైన వాటికి పరీక్షలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ ఎంతో ఖరీదైన వైద్య పరీక్షలను అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచితంగా చేయటం హర్షణీయమని హాస్పిటల్స్ డైరెక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. అంజిరెడ్డి హాస్పిటల్స్ సిబ్బంది మాట్లాడుతూ ప్రతి బుధవారం న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగంలో డాక్టర్ విద్యాసాగర్, యూరాలజీ విభాగంలో డాక్టర్ లోకేష్ కుమార్ అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి శుక్రవారం కార్యాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ కోట శబరి గిరీష్ అందుబాటులో ఉంటున్నారన్నారు.

ఉద్యోగ భద్రత, మెరుగైన జీతం కోసం ఉద్యమాలు

సిఐటియు మండల మహాసభ - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మాట్లాడుతున్న శివకుమారి

సిఐటియు మండల మహాసభ పట్టణంలోని కన్నెగంటి హనుమంతు భవనంలో బుధవారం నిర్వహించారు. సభకు చిట్టి ముక్కంటి అధ్యక్షత వహించగా శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి.శివకుమారి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని, అందులో భాగంగానే 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు వేతన కోడ్‌లుగా మార్చారని చెప్పారు. అదే విధానాలను రాష్ట్ర ప్రభుత్వమూ అమలు చేస్తోందని, అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం తదితర స్కీం వర్కర్లను పర్మినెంట్ చేస్తామనే హామీని విస్మరించిందని అన్నారు. పైగా రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో అన్ని రంగాల కార్మికులు తమ హక్కుల రక్షణతోపాటు ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా 18, 19 తేదీల్లో వినుకొండలో నిర్వహించే సిఐటియు పల్నాడు జిల్లా ప్రథమ మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా 13 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సంపత్ వెంకటకృష్ణ, తెలగపల్లి శ్రీనివాసరావు, ఎన్నికయ్యారు. మహాసభలో స్కీమ్ వర్కర్లు, ఆటో, మున్సిపల్, పంచాయతీ, సున్నం మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

రాయితీపై మోకీలు ఆపరేషన్

ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణంలోని పల్నాడు రోడ్‌లో ఉన్న శ్రీ రాఘవేంద్ర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత, హైదరాబాద్ అపోలో హాస్పిటల్ మాజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రముఖ ఎముకల వైద్యులు డాక్టర్ కనకగిరి అనిరుద్ ఫణిభార్గవ్ తెలిపారు. ఆస్పత్రిలో అందించే వైద్య సేవలపై కరపత్రాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. హాస్పిటల్ స్థాపించిన అనతికాలంలోనే పల్నాడు ప్రజల ఆదరాభిమానాలతో విశేష సేవలు అందించగలిగామన్నారు. జర్మనీ ఇంప్లాంట్‌తో మోకీలు చిప్ప మార్పిడి ఆపరేషన్‌కు రూ.లక్షన్నర అవుతుందని అయితే హాస్పిటల్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా రూ.70 వేలకే రాయితీపై చేస్తామని, ఈ అవకాశం ఈ ఏడాది చివర వరకు ఉంటుందని తెలిపారు. తమ హాస్పిటల్‌లో మోకాళ్ల నొప్పులు, వెన్నుపూస నొప్పులు, కీళ్లవాతం, యాక్సిడెంట్ కేసులు, కీళ్ల మార్పిడికి అత్యాధునిక చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. స్త్రీల ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణులు డాక్టర్ సత్యకృష్ణ దీపిక దమ్మవళం అందుబాటులో ఉంటారని, లాప్రోస్కోపీ, ఇన్ఫిటిలిటీ, గర్భిణీలో వచ్చు బీపీ, షుగర్, ఫిట్స్, రక్తహీనత, ఉమ్మనీరు పెరుగుట, తరుగుట, గర్భసంచి సమస్యలు, థైరాయిడ్ మొదలగు వ్యాధులకు చికిత్స అందిస్తామని వివరించారు. ఈ వైద్యసేవలను పల్నాడు, పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

గ్రామస్థాయి నుండి క్రీడా పోటీలు

సిఎం ప్రైజ్ మనీ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జగనన్న క్రీడా సంబరాలు -2022 సీఎం ప్రైజ్ మనీ టోర్నమెంట్ బ్రోచర్‌ను మంగళవారం కలక్టరేట్ జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో క్రీడా సంబరాలు-2022 ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజేతలైన జట్లకు రూ.50 లక్షల వరకు నగదు బహుమతులు అందించనున్నారన్నారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ (సింగిల్స్,డబల్స్) పురుషులు, మహిళలకు, మెన్స్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో జట్లను ఎంపిక చేశామని, వీరికి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లకు జోనల్ స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ జట్లను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఫైనల్ విజేతలకు డిసెంబరు 21న బహుమతు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్టెఫ్ సిఇఓ వెంకటనారాయణ, జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ చీఫ్ కోచ్ మహేష్, జిల్లా టూరిజం అధికారి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల విధానాలతో సంక్షోభంలో వ్యవసాయ రంగం

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రస్తుతం దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, పాలకులదే ఈ పాపం అని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు చెప్పారు. బుధవారం తాడేపల్లి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ విధానాల వలన ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక అనంతపురం, కర్నూలు జిల్లాలో వేరుశనగ, టమాటా వేసిన రైతులు ఒక్కో రైతు ఎకరానికి రూ.50వేల నుండి లక్షరూపాయలు నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు మద్దతు ధర ప్రకటించాల్సిన కేంద్రం చోద్యం చూస్తుందని మండిపడ్డారు. వ్యవసాయాన్నికార్పోరేట్లకు కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. వారికోసమే దొడ్డిదారిన మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారని దుయ్యబట్టారు. రైతులు చారిత్రాత్మక పోరాటంతో వాటిని తిప్పికొట్టగలిగారని చెప్పారు. పోరాటం సందర్బంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికి అమలుపరచలేదని విమర్శించారు. కనీస మద్దతు ధరప్రకటించి వ్యవసాయరంగాన్ని, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అతివృష్టి, అనావృష్టి ఫలితంగా పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతు ప్రభుత్వాలు చెప్పుకునే కేంద్రం, రాష్ట్రం రైతుకు ఉపశమనం కలిగే చర్యలు తీసుకోవడంలోమాత్రం విఫలమవుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్‌చేశారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేయడంతోపాటు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు ఎం.రవి, భీమిరెడ్డి కోటేశ్వరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాశం రామారావు, పక్కన ఎం రవి, ఈమని అప్పారావు, బి కోటేశ్వరి

19న గుంటూరులో రాష్ట్ర సదస్సు

వ్యవసాయరంగంసంక్షోభం- పరిష్కార మార్గాలు అనే అంశంపై ఈ నెల 19వ తేదీ గుంటూరు వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు రామారావు తెలిపారు. ఈ సదస్సులో ఎఐకెఎస్ అఖిలభారత అధ్యక్షులు అశోక్ దావలే, ప్రధానకార్యదర్శి హన్నన్ ముల్లా, సహాయ కార్యదర్శి విజుకృష్ణ, పాల్గొననున్నారని చెప్పారు.

మార్తా కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో బీఎస్సీ నర్సింగ్

ప్రజాశక్తి తెనాలి

మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్న బిఎస్సీ నర్సింగ్ కోర్సు మార్తా కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో అందు బాటులో ఉందని ఆ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ యనమల ఈశ్వర్ చెప్పారు. స్థానిక సుల్తానాబాద్ లోని కే ఎస్ కే గ్రూప్ విద్యాసంస్థల ఆవరణలో బుధవారం ఆయన మాట్లాడుతూ నర్సింగ్ విద్యలో తమకు విశేష అనుభవం ఉందని, ఆ అనుభవంతోనే దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో ప్రధాన రహదారి వెంట నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. నాణ్యత ప్రమాణాలు కలిగిన విద్యతో పాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. నాలుగు రోజుల్లో వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు వెబ్ ఆప్షన్‌లలో మార్త స్కూల్ ఆఫ్ నర్సింగ్‌ను ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తారన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు కళాశాలలోకాని, 9347653737 నెంబర్ లో గాని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు : స్పందన అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించే శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం కలక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి అభివద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై నియోజవర్గ, మండల ప్రత్యేక అధికారులు, డివిజనల్ మరియు మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమీషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిఆర్‌ఓ కే.చంద్ర శేఖర రావు, గ్రామ/వార్డు సచివాలయ జిల్లా అధికారి మోహన్ రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాతూరి కోటేశ్వరరావు

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సదాశివరావు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజిలో, సాహితీ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ కాసరనేని సదాశివరావు శతజయంతి ఉత్సవాలలో భాగంగా మొదటి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీ సమితి ఉపాధ్యక్షులు పంచుమర్తి నాగసుశీల మాట్లాడుతూ వైద్యులకే వైద్యుడిగా పేరొందిన సదాశివరావు ప్రజావైద్యుడిగా, కళాపోషకుడిగా, విద్యావేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా వెలుగొందారని, ఆయన గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ కళాశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను పేర్కొంటూ, వారి భావాలను నేటి తరం ఆచరించి చూపాలన్నారు. శతజయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు పాతూరి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీ మోహన్ కళాశాల నిర్మాణం నుండి నేటి రూపు రేఖల వరకూ కీలకమైన సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ యస్.ఆర్.కె.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

వితరణశీలి వెంకటరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యార్థుల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించిన అరవింద సంస్థల వ్యవస్థాపకులు చాగంటి వెంకటరెడ్డి గొప్ప వితరణశీలి అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో అరవింద స్కూలు ఆవరణలో అరవింద విద్యాసంస్థల వ్యవస్థాపకులు చాగంటి వెంకటరెడ్డి సంస్మరణ సభ బొమ్మ పిచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగింది. అరవింద స్కూల్ ఆవరణలో జరిగిన సంస్మరణ సభలో వక్తలు వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుంచనపల్లిలో అరవింద విద్యాసంస్థను స్థాపించడమే కాక, చుట్టుపక్కల గ్రామాలలో విద్యార్థుల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించిన వెంకట్ రెడ్డి బౌద్ధ మత అభిమానిగా, ఎందరికో ఆప్తులుగాను, ఎన్నో సేవ కార్యక్రమాలను చేసేవారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మరియు సహకార శాఖ అడ్వైజర్ బత్తుల బ్రహ్మానందరెడ్డి, రేరా కమిషనర్ ఈద రాజశేఖర్ రెడ్డి, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మంగళగిరి మాజీ శాసనసభ్యులు కాండ్రు కమల, ప్రముఖ విద్యావేత్త శివరాం, పర్యావరణ వేత్త మరియు ఆవారా వ్యవస్థాపకులు డాక్టర్ అజయ్, బుద్ధ పూర్ణిమ పత్రిక వ్యవస్థాపకులు ఆలీ బోధి, ముద్రిక ప్రచురణ కర్తలు కపాకరరావు, సోషలిస్ట్ అడ్వకేట్ మోదుగుల పాపిరెడ్డి, రిటైర్డ్ ఫైనాన్స్ అడిషనల్ సెక్రెటరీ ఎర్ర రామకష్ణ, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ ఎం సి దాస్, తాడేపల్లి మండల మాజీ ఎంపీపీ దొంతి రెడ్డి వేమారెడ్డి, అరవింద విద్యాసంస్థల ప్రిన్సిపల్ బి ఇంద్రాణి పాల్గొ న్నారు.

ఎస్ఆర్ఎంలో డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్

120 మంది విద్యార్థులకు ప్రాథమిక స్థాయి శిక్షణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : ఏపి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న డ్రోన్ టెక్నాలజీ శిక్షణ బుధవారం సాయంత్రం ముగిసింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా ముగింపు సమావేశానికి హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంటర్ప్రె న్యూర్షిప్ అసోసియేట్ డైరెక్టర్ ఉదయన్భక్షి అధ్యక్షతన సమావేశంలో వైనాఛాన్సలర్ ఆచార్య మనోజకుమార్ మాట్లా డుతూ త్వరలో డ్రోన్ టెక్నాలజీ ఎక్సెన్స్ సెంటర్ ప్రారంభిస్తామని, ఫ్యాకల్టీలను ఐదు గ్రూపులుగా విభజిం చనున్నామని తెలిపారు. వర్క్‌షాప్‌ను నిర్వహిం చిన కంకిపాడు పోపెల్ టెక్నాలజీస్ సీఈవో గోపీరాజ మాట్లాడుతూ, విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీ పట్ల ఆసక్తి కనబరిచి ఆ రంగంలో నిష్ణాతులు కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

రొటేషన్ పద్ధతిలోనే విధులు కేటాయించాలి

- గుంటూరు డిపో-1 అధికారులకు ఉద్యోగ సంఘాల జెఎసి వినతి

ప్రజాశక్తి-గుంటూరు: స్థానిక గుంటూరు డిపో-1 పరిధిలో కండర్లు, డ్రైవర్లకు విధులకు సంబంధించి రొటేషన్ విధానంలో కాకుండా ప్రతి రోజూ ఒకే విధంగా విధులు కేటాయిస్తూ చేసిన ప్రతిపాదలను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆర్టీసి ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు జెఎసి నాయకులు డిపో-1 అసిస్టెంట్ మేనేజర్‌కు తమ అభ్యంతరాలను తెలియజేశారు. అలాగే హైర్ బస్సులను ఒకే 'కీ' లో ఉంచటాన్ని వ్యతిరేకిస్తూ, అవకాశం ఉన్నంత వరకూ ఆఫ్‌లో డ్యూటీ వచ్చే విధంగా కీలు ఏర్పాటు చేయాలని కోరారు. వీలైనంత వేగంగా డిజిటల్ ఛార్టుల ప్రక్రియ పూర్తి చేసి ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈయు సెక్రెటరీ జె.రత్నాకర్, ఎస్‌డబ్ల్యూఎస్ సెక్రెటరీ యం.రామకృష్ణ, వైఎస్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.శ్రీనివాసరెడ్డి, కార్మిక పరిషత్ నాయకులు జి.నాగభూషణం పాల్గొన్నారు.

నటశేఖరుడికి కన్నీటి వీడ్కోలు

అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

ప్రజాశక్తి -తెనాలి: సూపర్ స్టార్ కృష్ణ అంతిమయాత్రలో తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. ప్రజల సందర్శనార్థం కృష్ణా పార్థివ దేహాన్ని హైదరాబాద్ పద్మాలయ స్టూడియోస్‌లో ఉంచిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే బుధవారం అక్కడికి చేరుకొని కృష్ణా మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుర్రిపాలెం అభివద్ధిలో ఆయన ఎంతో కీలకంగా వ్యవహరించారని, పద్మాలయ స్టూడియోస్ ద్వారా తెనాలి పరిసర ప్రాంత వాసులకు ఎంతోమందికి ఉపాధి కల్పించారని ఎమ్మెల్యే తెలిపారు. తెనాలిలో నిర్మిస్తున్న తెనాలి బండ్ పై కష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అంతిమయాత్రలో తెనాలి, బుర్రిపాలెం గ్రామస్తులు పలువురు తరలి వెళ్లారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఖాసిం

ఉర్దూ పాఠశాలలో డిఐ ఖాసిం తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పాతగుంటూరులోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డిఐ ఎండి ఖాసిం బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఆహర పదార్థాలను పరిశీలించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి : సిఐటియు

ప్రజాశక్తి - తుళ్లూరు : అసెంబ్లీ, సచి వాలయంలో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ లోకి తీసుకొని వారి జీతాలను పెంచాలని సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రవి ఎం భాగ్యరాజు కోరారు. బుధవారం సాయంత్రం మల్కాపురంలో జరిగిన అసెంబ్లీ, సచివాలయ కార్మికుల విస్తత సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ, సచివాలయ కార్మికులకు రెండు నెలల పెండింగ్ జీతాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని వారు తెలిపారు.సమావేశంలో నాయకులు గ్రేస్, గోడవర్తి బుజ్జి, నాగరాజు, శ్రీలత, ఏసు దయమ్మ పాల్గొన్నారు.

30వ రోజుకు ఆందోళనలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు విడుదల చేయాలని పని భద్రత కల్పించాలని బుధవారం నవులూరు గ్రామంలో నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికుల పని గ్యారంటీకై జనవరి నుండి కొత్త టెండర్‌ను సిఆర్‌డిఎ అధికారులు పిలవాలని కోరారు. ఈ సంవత్సరం డిసెంబర్ తో సుమిత్ కంపెనీ టెండర్ పూర్తికావస్తున్న నేపథ్యంలో కొత్త టెండర్ ను పిలవాలన్నారు. ం కార్మికులకు నాలుగో నెల గడుస్తున్న జీతాలు చెల్లించకపోవడంతో తీవ్రమైన ఆర్థిక సమస్యలతో కుటుంబాలు సతమతమవుతున్నాయని అన్నారు. తక్షణం కార్మికులకు పెండింగ్ లో ఉన్న మూడు నెలల జీతాన్ని వెంటనే ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు చెరుకూరి సుశీల, రాచూరి వేణు తదితరులు పాల్గొన్నారు.

పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం పద్దెనిమిదేళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, తదనుగుణంగా వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడ౦ం జరిగిందని పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. స్థానిక ఎఎంజి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టి సిపేషన్) కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతి థిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లా డుతూ 1.1. 2023 నాటికి పద్దెనిమిదేళ్లు నిం డే వారు తప్పనిసరిగా ఫామ్ -6 ద్వారా ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. ధనిక, బీద అనే వైషమ్యాలు లేకుండా ఉండే హక్కు ఒక ఓటు హక్కు మాత్రమేనని, రాజ్యాంగం ఇచ్చిన ఈ హక్కు ప్రతి పౌరుడికి చెం దాలన్నారు. భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చిందని, దానికి ఒక రోజు ముందుగా ఎన్నికల సం ఘం ఏర్పడిందన్నారు. అందుకనే ప్రతి ఏడాది నవంబర్ 26 ను కాన్సిట్యూషనల్ డే గా నిర్వహించుకోవడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికలు ప్రశాంత వాతావర ణంలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించేందుకు రాజ్యాంగం ప్రకారం ఎన్నికల సంఘం ఏర్పడిందన్నారు. సచివాలయంలోని బూత్ లెవెల్ ఆఫీసర్ల ద్వారా పద్దెనిమిదేళ్లు నిం డిన ప్రతి ఒక్కరూ ఫామ్- 6ను పూర్తి చేసి ఓటు హక్కు పొందాలన్నారు. కార్యక్రమం లో చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ గోవిందరావు, నియోజకవర్గ ఎన్నికల అధి.కారి వసంత కుమార్, చిలకలూరిపేట మం డల తహశీల్దార్ సుజాత, ఎఎంజి కాలేజీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. **ముప్పాళ్ల:** మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఓటు హక్కుపై అవగాహన, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ భవానీ శంకర్ పాల్గొన్నారు. ఓటు నమోదుకు మాన్యువల్ ఫారం-6 అర్జీలను అందజేశారు. అనంతరం ఓటు హక్కు వినియోగ ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిడివో పి.పుట్టారెడ్డి, మండల విద్యాశాఖాధికారి ఒంగోలు రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వీప్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

రైతు భరోసా కేంద్రాల్లో సమృద్ధిగా ఎరువులు

ప్రజాశక్తి- నరసరావుపేట

మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నా యని, ఆర్‌బికె సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవా లని మండల వ్యవసాయ శాఖాధికారి వి.నరేంద్రబాబు రైతు లకు సూచించారు. మండలంలోని యల్ల మంద రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రైతులు ఎరువుల కోసం పట్టణాల్లోని దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, రైతు భరోసా కేంద్రంలో కొనుగోలు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖాధికారుల సూచనలు మేరకు ఎరువులు వినియోగించాలని, సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. అనంతరం గ్రామంలో ఏయే పంటలు సాగు చేస్తున్నారో, ఇ- క్రాప్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నారా లోకేష్‌ను కలిసిన సీనియర్ నాయకులు

ప్రజాశక్తి - నూజెండ్ల

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మండలం సీనియర్ నాయకులు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముంద్ర సుబ్బారావు, వినుకొండ నియోజకవర్గం ఐ-టిడిపి అధ్యక్షులు కంచుమటి నరేష్ బుధవారం కలిశారు. ఉండవల్లిలోని లోకేశ్ స్వగృ హంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు, పార్టీ అంశాలపై చర్చించినట్లు సమాచారం. సభ్యత్వ నమోదులో వినుకొండ నియోజకవర్గం రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉన్నందుకు వారిని అభినందించారు.

మంచి ప్రణాళికతో ముందుకెళితే విజయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్రంలో రానున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే మంచి ప్రణాళికతో ముందుకెళితే విజయం తమ దేనని తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పఠాన్ సమద్ ఖాన్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం జరిగింది. నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదా శివరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా, తెలుగుదేశం పార్టీ ఐ -టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మారెళ్ళ అప్పారావు ప్రసంగించారు.

నకరికల్లు రెవెన్యూ అధికారుల నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి - నకరికల్లు

గ్రామ రెవెన్యూ అధికారుల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరి గిన ఎన్నికలలో గ్రామ రెవెన్యూ అధికారుల మండల అధ్యక్షుడుగా కొండపరెడ్డి రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా చింతిరాల యువరాజ్, పెమ్మసాని వెంకట కోటే శ్వరరావు, కోశాధికారిగా భువనగిరి నాగలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా నూతలపాటి ప్రేమ్ చందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని తహశీల్దార్ సురేష్, రెవెన్యూ సిబ్బంది సన్మానించి, అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న ఎడిఎ జగదీశ్వర్ రెడ్డి

రైతుల సంక్షేమాన్నీ దృష్టిలో ఉంచుకోవాలి

ప్రజాశక్తి - మాచర్ల

పురుగుమందుల వ్యాపారులు వ్యాపారదృక్పథంతోనే కాకుండా రైతుల సంక్షేమాన్నీ దృష్టిలో ఉంచుకోవాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు కురిసాయి మార్కొండరెడ్డి అన్నారు. స్థానిక మానకొండ కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ రైతు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మార్కొండరెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. మరో ముఖ్యఅతిథి ఎడిఎ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో సమస్యల పరిష్కారం కోసం ముందుగా పురుగుమందుల డీలర్ల వద్దకే వస్తారని, వారు కనుక సరైన సూచనలు ఇవ్వకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఈ సందర్భంగా మిర్చి పంటపై రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్సెక్టిసైడ్స్ ఇం డియా వైస్ ప్రెసిడెంట్ వికె గార్గ్, జనరల్ మేనేజర్ బి.జయరాం పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - కారెంపూడి

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలక మని తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్, కారెంపూడి సిఐ జయకుమార్ ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్ , ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో భవిత మానసిక ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సభలో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే విలేకరులు సమాజంలో జరిగే అన్యాయాలను వెలుగులోకి తేవడంలో వారి పాత్ర కీలకమని వారు అన్నారు. ప్రజలకు ఉపయోగపడే సమస్యలపై పత్రికా రంగం శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకును మానసిక వికలాం గుల విద్యార్థులతో కలిసి తహశీల్దార్,సిఐ, ఎంపీడీవో కేకును కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఏపీ యూడబ్ల్యూజే, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: మంత్రి

ప్రజాశక్తి - నాదెండ్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. మండలంలోని తూబాడు రాజుగారిపాలెంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి తలతోటి రాణి పాల్గొన్నారు.

వీరారాధన ఉత్సవాలపై నేడు సమీక్ష

ప్రజాశక్తి-కారెంపూడి

ఈ నెల 23 నుండి 27వ తేదీ వరకు కారెంపూడి మం డలంలో జరుగు వీరారాధన ఉత్సవాలపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో ఎంతో ఘనంగా నిర్వహించే ఐదు రోజుల ఉత్సవాలపై మం డలంలోని వివిధ శాఖ అధికారులతో, ప్రజా ప్రతినిధులతో, స్వచ్ఛంద సంస్థలతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైతులకు నూతన కంది రకాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని కోనంకిలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కంది పంటలో సమగ్ర సస్యరక్షణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లాం ఫారం నుంచి కంది సైంటిస్టులు డాక్టర్.ఎం. శ్రీకాంత్, డాక్టర్ ఎస్. రాజమణి కంది పంటలో సమగ్ర యాజమాన్యం పద్ధతిలో ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రంలో 25 ఎకరాలకు గాను నూతన రకాలైన ఎల్. అర్. జి -133-33 అను కంది రకాన్ని, పురుగు మందులైన (కోరాజన్) క్లోరాంత్రనిలిప్రోల్18.5%, (ఒమైట్) ప్రొపర్గైట్ 57% ఈసిలను గ్రామ రైతులకు ఉచితంగా అందజేశారు. ఎడిఎ బి. శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ నూతన కంది రకాన్ని సైంటిస్టులు తరచూ పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధి కారి ఎన్. శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ తిరుపతయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.రాజశేఖర్, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కోటనెమలిపురిలో పంట కోతప్రయోగం

ప్రజాశక్తి-రాజుపాలెం

మండలంలోని కోటనెమలిపురిలో బుధవారం పంట

కోత ప్రయోగం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రోసూరు సహాయ వ్యవసాయ సహాయకులు వి.హనుమం తరావు మాట్లాడుతూ 25 చ.మీ ల విస్తీర్ణంలో వరి పంట కోసి, నూర్పిడి చేసి, తూకం వేయగా 20.290 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. దీని ప్రకారం ఒక ఎకరాకు సుమారు 36 బస్తాలు వరకు దిగుబడి వస్తుందని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి పి.వెంకట నరసయ్య, యస్.బి.ఐ జనరల్ రిప్రజెంటివ్ సంజయ్, ఎఎస్ఒ అంజలి, వివిఎలు, రైతులు పాల్గొన్నారు.

'బొబ్బర' నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మిర్చి లో బొబ్బర తెగులు నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని సత్తెనపల్లి ఉద్యానవన శాఖాధికారిణి సిహెచ్ జననీ రైతులకు సూచించారు. సత్తెనపల్లి మండలం అబ్బూరు, భట్లూరు, కట్టమూరు, గోరంట్లలలో బుధవారం ఉద్యానవన శాఖాధికారులు మిర్చి పొలాలను పరి శీలించారు. తెల్లదోమ, రసం పీల్చే పురుగులు, తెగుళ్ళు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. సస్యరక్షణా చర్యలు, పిచికారి చేయాల్సిన పురుగు మందుల గురించి వివరించారు. ఉద్యానవన సహా యకులు పవన్, అభిరామ్, చాందిని తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటతో ఆరోగ్యం, ఆదాయం

ప్రజాశక్తి - అమరావతి

మండల పరిధిలోని ఎండ్రాయి యూనిట్, లేమల్లె గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ పెరటి తోటలను రైతు సాధికారిక సంస్థ రీజియన్ కోఆర్డినేటర్ వెంకట్రావు ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. పెరటి తోటల వలన కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పెరటి తోటలు వేయడానికి వీలు లేని కుటుంబాలు సామూహికంగా పొలం లీజుకు తీసుకొని పెరటి తోటలు పెంచుకోవాలని సూచించారు. తద్వారా ప్రతి కుటుంబానికి ఆదాయం, ఆరోగ్యం కూడా చేకూరుతుం దని చెప్పారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి పెరటి తోటలు మోడల్ గురించి చర్చించారు. గ్రామంలో ప్రతి ఒక్క కుటుంబం పెరటి తోటలు వేసుకునే విధంగా అవగాహన కలిగించాలన్నారు. ప్రతి ఏడాది పెరటి తోట విత్తనాలు ఎవ రికి వారు సొంతంగా సేకరించుకోవాలని సూచిం చారు. కిచెన్ వేస్ట్‌తో ఎరువులు ఎలా తయారు చేయాలో తెలిపారు.

వాకింగ్ ట్రాక్‌పై ముళ్ల కంచె

- ఆకతాయిల చేష్టలతో వాకర్లకు తప్పని ఇక్కట్లు
- సమస్యను పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి

వాకింగ్ ట్రాక్‌పై అడ్డంగా వేసిన ముళ్ల కంచె

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

అకతాయిల చేష్టలు వాకర్లకు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని నిలువరించాల్సిన అధికారులు వాకింగ్ ట్రాక్‌పై ముళ్ల కంచె వేశారు. దీంతో వాకింగ్ ట్రాక్‌పై వాకర్లకు కూడా వెళ్లేందుకు వీలు లేకకుండా పోయింది.

మండలంలోని నిడమర్రులో చెరువు ద్వారా తాగునీరు సరఫరా చేస్తుంటారు. గతేడాది ఈ చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చెరువు కట్ట అభివృద్ధికి ఆదేశించారు. దీంతో చెరువు కట్ట చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుండి ఈ ట్రాక్‌లో స్థానిక యువతతో పాటు పెద్దలు, మహిళలు వాకింగ్, జాగింగ్, రన్నింగ్ వంటివి చేస్తున్నారు. అయితే కొద్దికాలగా ఆకతాయిలు ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాత్రిళ్లు మద్యం తాగడంతోపాటు ఆ సీసాలను అక్కడే పగలగొట్టి దారిలో వేస్తున్నారు. దీనిపై పోలీసులకు సచివాలయ అధికారులు ఫిర్యాదు చేసినా చర్యలేమీ తీసుకోలేదు. దీంతో ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఇటీవల కొంతమంది మద్యం మత్తులో వాకింగ్ ట్రాక్‌లోని లైట్లను ధ్వంసం చేయడంతో అటుగా ఎవరూ వెళ్లకుండా ఆ మార్గంలో సచివాలయ అధికారులు వారం కిందట ముళ్లకంప వేయించారు. అప్పటి నుండి వాకింగ్ చేయడానికి వీలుపడక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు సత్వరమే స్పందించాలని, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న కలెక్టరేట్‌లోని సంఘ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సంఘం సెక్రెటరీ సిహెచ్.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ప్రత్యూష దంతవైద్యశాల డాక్టర్లు డాక్టర్ ప్రత్యూష కొండ, డాక్టర్ నసీమాలు దంత వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అలాగే టైమ్స్ క్లినిక్ వారి సౌజన్యంతో ఉచిత బాడీ చెకప్, బిపి, షుగర్ పరీక్షలు చేస్తారన్నారు. విశ్రాంత, ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డంపింగ్ యార్డ్ లో సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

కంపోస్ట్ యంత్ర పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి- తెనాలి : స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డ్‌లో విండ్రో కంపోస్ట్ యంత్ర పనితీరుపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు సిబ్బందితో బుధవారం సమీక్షించారు. తడి చెత్త నుంచి ఎరువును తయారుచేసే కంపోస్ట్ యార్ ను, బయోగ్యాస్ ఉత్పత్తి ప్లాంటును, అరటి ఆకులు గెలలను ముక్కలు చేసే ఎఫ్ఎస్‌టిసి ప్లాంటును, తడి చెత్తను కుళ్ళబెట్టి సేంద్రియ ఎరువును తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. యార్డులోని వేస్ట్‌ను గుంటూరు సమీపంలోని నాయుడుపేట డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సిబ్బందికి సూచించారు.50 మంది పారిశుధ్య కార్మికులతో డంపింగ్ యార్డ్ సుందరీకరణకు చేపట్టాల్సిన పనులను శానిటరీ విభాగం అధికారులకు వివరించారు. ఇన్‌స్పెక్టర్లు ఏ రామచంద్రరావు, డి శ్రీనివాసరావు, షేక్ బాజి హుస్సేన్, సిబ్బంది ,ఉన్నారు

ఓటరు నమోదులో పూర్తి స్థాయి విచారణ చేపట్టాలి

జాబితాలను పరిశీలిస్తున్న ఎం.వి శేషగిరిబాబు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఓటరు నమోదులో పూర్తి స్థాయిలో విచారణ జరిపి నోటీస్ బోర్డులో అభ్యంతరాలు తెలపాలని ఉమ్మడి గుంటూరు జిల్లా ,కృష్ణాజిల్లాల ఇంచార్జ్, ఇండర్మీడియట్ ఎడ్యుకేషనల్ బోర్డు కమిషనర్ ఎం.వి. శేషగిరిబాబు తెలిపారు. బుధవారం కుంచనపల్లి , ప్రాతూరు గ్రామాల్లో ఆయన ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 9వ తేదీ నుండి జరుగుతున్న ఓటర్ల లిస్టులో మార్పులు, చేర్పులు కొత్త ఓటర్లు పేరును నమోదు చేసేటప్పుడు, తొలగించేటప్పుడు ఫీల్డ్ లెవల్లో పూర్తిస్థాయి విచారణ చేసి, అనంతరం నోటీస్ బోర్డ్‌లో అభ్యంతరాలను తెలపాలనీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ రోల్ అబ్యూరల్, పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కె లలిత కుమారి, తాడేపల్లి మండల తహసిల్దార్ వాక శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదును అందజేస్తున్న చైర్మన్ కె. ఇక్బాల్ అహమ్మద్‌ఖాన్

ఖిద్మత్ బ్యాంకు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -మంగళగిరి

మధ్యతరగతి,పేద ప్రజల అవసరాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్న ఖిద్మాత్ బ్యాంక్ సేవలు అభినందనీయమని ఏపీ మైనార్టీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. ఇక్బాల్ అహమ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక తెనాలి రోడ్డులోని ఖిద్మత్ బ్యాంక్‌శాఖలో రుణాలకు అర్హులైన వారికి ఆయన చేతుల మీదుగా నగదును అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లడుతూ రుణాలకోసం ఆనేకమంది యాపులను ఆశ్రయించి మోసపువడం, వేదింపులకు గురై ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతుందన్నారు. ఖిద్మత్ స్వచ్ఛంద సేవాసంస్థ రుణ అవసరార్థులకు వడ్డిలేని డబ్బు సాయాన్ని అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో విస్తరించాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో ఖిద్మత్ డిస్ట్రిక్ బోర్డ్ డైరెక్టరులు ఏస్‌ఏ సాలార్, అసదుల్లా ఉమరి, మంగళగిరి బ్రాంచ్ మేనేజింగ్ కమిటి ప్రెశిడెంట్ షేక్ సందాని, మంగళగిరి బ్రాంచ్ బిఎంసి మెంబర్లు షేక్ నిజాముద్దీన్, విజయ కుమార్, బ్రాంచ్ మేనేజరు షేక్ రఫీ, బ్రాంచ్ ఎల్డర్ కౌన్సిల్ మెంబర్లు అబ్దుల్ ఖదర్ బాబావలి, షేక్ అబ్దుల్ అజీమ్, షేక్ అన్వర్ అలీ పాల్గొన్నారు

వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

ప్రజాశక్తి- మంగళగిరి

వైసిపి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి టీ జానకి దేవి అన్నారు. బుధవారం పట్టణంలోని 27 వార్డులోని పావురాలు కాలనీలో టిడిపి నిర్వహిస్తున్న బాదుడే బాదుడు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై అనేక భారాలను మోపారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, గోశాల రాఘవ, వాకా మాధవరావు, రాయపాటి విజయ్ కుమార్, షేక్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెకు ఇచ్చిన ఇంటికి 15 నెలలైనా అద్దె చెల్లించలేదు

- యజమాని అడిగితే వస్తాయిలే అంటూ దాటవేత
- 6 నెలల కరెంట్ బిల్లూ కట్టకపోవడంతో పవర్ కట్

టిడిపి నాయకుల వద్ద వాపోతున్న యజమాని పుష్పావతి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

రైతు భరోసా కేంద్రం నిర్వహణకు ఇచ్చిన ఇంటికి 15 నెలలైనా అద్దె చెల్లించలేదని, 6 నెలలుగా కరెంట్ బిల్లులు కూడా చెల్లించలేదని గొట్టిపాడు గ్రామంలోని ఇంటి యజమాని గుర్రం పుష్పావతి బుధవారం బాదుడే బాదుడు కార్యక్రమంలో టిడిపి నాయకులతో వాపోయింది. అద్దె చెల్లించాలని అడిగినప్పుడల్లా వస్తాయిలే.. పడతాయిలే అంటూ దాటవేస్తున్నారని అంటున్నారని చెప్పింది. కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో ఇల్లు చీకటిగా మారిపోయిందని మండల అధికారులను గట్టిగా నిలదీయడంతో ఆర్‌బికేలోని సామాగ్రిని తీసుకెళ్లేందుకు ఆటోను తీసుకోని వచ్చారని, అద్దె చెల్లించకుండా ఎలా తీసుకెళ్తారని తానూ ఒక తాళం వేసుకున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజక వర్గ ఇంచార్జ్ మాకినేని పెదరత్తయ్య, గ్రామ అధ్యక్షుడు జె. మల్లేశ్వరరావు, సర్పంచ్ పి. మరియ రాణి, నాయకులు ఎ. పండు రంగరావు, రాష్ట్ర బిసిసెల్ కార్యదర్శి ఇ. భగత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్ఎస్ వాలంటీర్లు

స్వయం ఉపాధి శిక్షణపై అవగాహన

ప్రజాశకి-తాడేపల్లి రూరల్

కెఎల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో ఇంటింటికి తిరిగి, నిరుద్యోగ యువతకు సంస్థ అందిస్తున్న ఉపాధి కల్పన శిక్షణ పట్ల అవగాహన కల్పించినట్లు యూనివర్సిటీ డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సిహెచ్ . హనుమంతరావు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా గన్నవరం మండలంలోని ఆత్కూరులో నిరుద్యోగ యువతకు కేఎల్ యూనివర్సిటీ, స్వర్ణ భారతీ ట్రస్ట్, ఇండియన్ బ్యాంక్ ఏర్పాటు చేసిన ఏపీజే అబ్దుల్ కలాం స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ పట్ల అవగాహన కల్పించినట్లు సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హబీబుల్లాఖాన్ పేర్కొన్నారు. పేద నిరుద్యోగ యువతకు ప్లంబింగ్, ఎలక్ట్రిషన్, టు వీలర్, ఫోర్ వీలర్ రిపేరింగ్, ఏసీ రిపేరింగ్ తదితర రంగాలలో ఉచిత శిక్షణ, వసతి సౌకర్యాలు కల్పించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కెవివి రాజు సూచించారు. ఈ కార్యక్రమానికి పి.సురేష్, జి.చంద్రశేఖర్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి శ్రీకాంత్ రెడ్డి, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తవేయకుండా అవగాహన కల్పించండి

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఉదయం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. మెయిన్ బజార్, హుస్సేన్ కట్ట, షరాబజార్, వడ్లపూడి సెంటర్ తదితర ప్రాంతాలలో పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. అదేవిధంగా కార్మికులకు చేతికి బ్లౌజులు, వివిధ పరికరాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కమిషనర్ యూ శారదా దేవి, వైయస్సార్సీపి రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులు గంజి చిరంజీవి, డిడిఈఎస్ వి.కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి నియోజకవర్గంలో 43 మందికి రూ.50 లక్షల చెక్కులను సీఎం సహాయనిధి నుండి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి బుధవారం మంగళగిరిలోని వైసిపి కార్యాలయంలో పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి, ఈ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనమంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి

మాట్లాడుతున్న ప్రత్యూష సుబ్బారావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్: విద్యార్థులు ఫేస్‌బుక్, ఇంస్టాగ్రామ్, చిట్‌చాట్‌లతో కాలయాపన చేయకుండా సంబ్జెక్టుల్లో విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ప్రముఖ సైక్రియాటిస్ట్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. బుధవారం వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్లో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుండి, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగడానికి కావాల్సిన లక్ష్యాలను, పోగొట్టుకోవాల్సిన చెడు వ్యసనాల గురించి ఆయన వివరించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను గౌరవించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బుద్ధిస్ట్ అర్జున్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు, గణితం ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, వ్యాయామ ఉపాధ్యాయులు కే కాంతారావు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఎం దృష్టికి రైతుల సమస్యలు

వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్. నాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ రంగాల భాగస్వామ్య పక్షాల ముఖాముఖి చర్చా కార్యక్రమంలో నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఎన్. శివరామకష్ణయ్య, ఎమ్మెల్యే ఆళ్ళ రామకష్ణారెడ్డి, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, జేసీ రాజకుమారి, మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, లాం ఫారమ్ శాస్త్రవేత్త చంద్రకాంత్ పాల్గొన్నారు. నాగిరెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు, సలహాలు, సూచనలను సిఎం దష్టికి తీసుకువెళ్లటానికి జిల్లాలలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా 18 జిల్లాలలో చర్చా కార్యక్రవలు జరిగాయన్నారు. రైతులు జిల్లా స్థాయిలో పరిష్కరించలేని తమ సమస్యలైన గ్రామాలలో డొంకరోడ్డు నిర్మాణం, పంట కాలువల ఆధునీకరణ, చెక్ డ్యాంల నిర్మాణం, ఆర్బికేలకు అద్దె బకాయి చెల్లింపులు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, వ్యవసాయ పరికరాలు, టార్పాలిన్ పట్టాలు, జొన్న, మొక్క జొన్న రైతులకు బిందు, తుంపర సేద్యం పరికరాలు సరఫరా మొదలైన వాటిని సిఎం దృష్టికి తీసుకెళతానన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో కొన్ని ఆర్బికేలకు అద్దె చెల్లించాలని, రైతులను చిరుధాన్యాలు పండించే విధంగా ప్రోత్సహించా లని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మే వారిపై విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ ద్వారా తనిఖీలు విరివిగా చేపట్టాలన్నారు. వరి పంటలో 22 శాతం తేమ నిబంధన వల్ల చిన్న, సన్నకారు, కౌలు రైతులు ధర కోల్పోవలసి వస్తుందన్నారు. పంట కోత సందర్భంలోనే సోలార్ డ్రయర్స్‌తో డ్రయప్ చేయిచండం వల్ల ఉపయోగం వుండే అవకాశం ఉందన్నారు. రైతులు తైవాన్ స్ప్రేయర్లు విపరీతంగా అడుగుతున్నారన్నారని, రైతులకు అందిస్తే మంచిదన్నారు. మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు వచ్చిన ఆదాయంలో 20 శాతం మార్కెట్ యార్డుకు ఖర్చు పెట్టుకునే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిరు ధాన్యాలు పండించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశం అనంతరం జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించేందుకు ముద్రించిన బిందు సేద్యం వ్యవస్థ యొక్క యాజమాన్యం, నిర్వహణ విధానంపై బ్రోచర్‌ను, మిరప పంటను క్రొత్తగా ఆశిస్తున్న నల్ల తామర పురుగు-యాజమాన్య పద్దతులు ఫోల్డర్‌ను ఆవిష్కరించడం జరిగింది. సమావేశంలో డీడీ హార్టి కల్చర్ సుజాత, పీడీ మైక్రో ఇరిగేషన్ వజ్రశ్రీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను బుధవారం వైస్ చాన్సలర్ ఆచార్య పి రాజశేఖర్ విడుదల చేశారు. 27088 విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగ 18081 మంది ఉత్తీర్ణుల య్యారని విసి తెలిపారు. ఈ ఫలితాలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ షషష.ఖఅబ.ఖఎ.అఅ నుండి పొందవచ్చునని తెలిపారు. రివాల్యుయేషన్, జవాబు పత్రాన్ని పర్సనల్ వెరిఫికేషన్, నకలు పొందటానికి ధరఖాస్తులకు ఈ నెల 30 ఆఖరు తేదీ అని చెప్పారు. అప్లికేషన్లను కళాశాల ప్రిన్సిపల్ ద్వారా మాత్రమే కో- ఆర్డినేటర్ యూజి పరీక్షల విభాగం వారికి సమర్పించాలన్నారు. రివాల్యుయేషన్‌కు రూ.1130, వెరిఫికేషన్‌కు రూ.1540 చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఎ సి ఇ అర్. ప్రకాశరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల చేస్తున్న విసి తదితరులు

బకాయిల కోసం 22న ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు :

ఎపిజిఎల్ఐ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లులు విడుదల చేయాలని ఈనెల 22న రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఏఒ ఎం.పూర్ణచంద్రరావుకు ధర్నా నోటీసు అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎపిజిఎల్ఐ బకాయిలు ఏడాదిపైగా పెండింగ్‌లో ఉన్నాయని, ఆరు నెలల నుండి పిఎఫ్ లోన్లు పెండింగ్‌లో ఉన్నాయని, మెడికల్ బిల్లులు అడ్రస్ లేవన్నారు. వివిధ రకాల బిల్లుల కోసం దరఖాస్తు చేసుకొని, చెల్లింపులు ఎప్పుడు జరుగుతాయో తెలియక ఉద్యోగులు తీవ్ర ఆవేదనలో ఉన్నారన్నారు. వీటిపై ఎన్నిసార్లు ప్రాతినిధ్యం చేసినా పట్టించుకోని పరిస్థితుల్లో ధర్నా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, ఎండి.షకీలాబేగం, జి.వెంకటేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యులు కె.రంగారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎఒకు ధర్నా నోటీసు ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ధూమపాన నియంత్రణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పొగాకు నియంత్రణ చట్టం పటిష్ట అమలుకు, చట్టం అతిక్రమణలను అరికట్టంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ లోని డిఆర్‌సి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమా వేశంలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం స్టేట్ నోడల్ ఆధికారి డాక్టర్ ఈ.ప్రశాంత్ మాట్లాడుతూ సిగరెట్, ఇతర పొగాకు అనుబంధ ఉత్పత్తుల చట్టం-2003 గురించి, లైన్ డిపార్ట్మెంట్స్ విధి విధానాలను సమగ్రంగా వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులు వివిధ రూపాల్లో మత్తుకు బానిసలు అవుతున్నారని, కావున అన్ని కాలేజీలు, హైస్కూల్స్‌లో విద్యార్థులందరికీ దీనిపై అవగాహన కల్పించాలని కోరారు. లైన్ డిపార్ట్మెంట్స్ వారందరికీ, తనకు కూడా పెనల్టీ విధించే చలానా పుస్తకాలను అందజేయాలని ఆదేశించారు. అదే విధముగా అధికారులు అందరూ దీనిపై శ్రద్ధ చూపి బహిరంగ ప్రదేశాలలో ధూమపానం నియంత్రణకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డిఎం అండ్‌హెచ్ఒ డాక్టర్ సుమయాఖాన్, డిసిహెచ్ఎస్ డాక్టర్ హనుమంతరావు, జిల్లా ఎన్‌టిసిపి ప్రొగ్రమ్ అధికారి డాక్టర్ శ్రవణ్ బాబు, డిపిఎంయు డాక్టర్ రత్నమన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రశాంత్, జెసి రాజకుమారి తదితరులు

నరసరావుపేట అభివృద్ధికి చర్యలు

పట్టణంలో గాంధీ పార్కు పున: ప్రారంభం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణ అభివద్ధికి అన్ని చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో అభివద్ధి చేసిన గాంధీ పార్కును ఎమ్మెల్సీ జంగా కష్ణమూర్తి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నరసరావుపేట నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చెత్తను తొలగించడానికి శాశ్వత ప్రాతిపదికన 14వ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు రూ.54 లక్షలతో చైన్ మౌంటెడ్ జెసిబీని కొనుగోలు చేశామని తెలిపారు. అదేవిధంగా పార్కులో పిల్లలు ఆట పరికరాలు పెద్దలకు ఓపెన్ జిమ్‌కు రూ.8లక్షల వెచ్చించామన్నారు. జిల్లాలో పర్యాటక అభివద్ధిలో భాగంగా కోటప్ప కొండ వద్ద జలవిహార్‌ను ఏర్పాటు చేశామని, అటవీశాఖ ఆధ్వర్యంలో వన సంరక్షణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇస్సప్పాలెం చెరువును అభివద్ధి చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న ప్రాంతంలో పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా గడియారం స్థంభం నుంచి చిలకలూరిపేట వెళ్లే రోడ్డు విస్తరణ చేస్తామని, వ్యాపారవేత్తలు కూడా సహకరించాలని కోరారు. త్వరలో కె.బి.ఆర్ పార్కును అభివద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. తొలుత చైన్ మౌంటెడ్ జెసిబిను లాంఛనంగా ప్రారంభించారు.

గాంధీపార్కు ప్రారంభిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎమ్మెల్యే తదితరులు

మూర్ఛవ్యాధిపై నేడు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ మూర్ఛరోగ అవగాహన దినం సందర్భంగా నేడు సాయంత్రం 5 గంటలకు బ్రాడీపేట 2/7లోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో మూర్ఛవ్యాధి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. బుధవారం బ్రాడీపేటలోని విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ ఎల్.ఎస్.భారవి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో గుంటూరు నగరంలోని ప్రముఖ న్యూరో ఫిజీషియన్లు, న్యూరో సర్జన్‌లు హాజరై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. మూఢ నమ్మకాలు, నాటు వైద్యుల ద్వారా కాకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు కోరారు. నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న ప్రజారోగ్య వేదిక మూర్ఛ వ్యాధిపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, కోశాధికారి పి.ఎస్.శేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మురళి, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యుత్ సమస్యలపై రేపు ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వినియోగదారుల రీడ్రస్సల్ ఫోరం అవగాహన సదస్సు గుంటూరులోని విద్యుత్ భవన్‌లో శనివారం నిర్వహిస్తున్నట్టు ఎగ్జిక్యూ టివ్ ఇంజినీరు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ సదస్సులో పాల్గొని విద్యుత్ శాఖ నుంచి ఎదురవు తున్న సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చునని అన్నారు. ఈ సదస్సుకు ఫోరం కేంద్ర కమిటీ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ పాల్గొంటారని తెలిపారు.

కిట్స్‌లో అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి, సిఎస్ఇ విభాగం, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ విద్యార్థులకు ఎలైట్ అసోసియేషన్ తరపున అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై ఆరు రోజుల వర్క్‌షాప్‌ను బ్రెయిన్ ఓ విజన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత మానవ జీవితంలో మొబైల్ అప్లికేషన్లకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, విద్యార్థులు నూతన ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే మొబైల్ అప్లికేషన్లు అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు ఆర్థిక సాయం అందించటానికి కిట్స్ యాజమాన్యం సిద్ధంగా ఉందని కళాశాల సెక్రెటరీ కోయి శేఖర్ తెలిపారు. నూతన టెక్నాలజీతో అప్లికేషన్లు తయారు చేయాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, విభాగాధిపతి డాక్టర్ జి.మురళి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితరులు

గంజాయి విక్రయాలపై కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గంజాయి వినియోగం, విక్రయం సరఫరా చట్టరీత్యా నేరం.ఇటువంటి చట్టవ్యతిరేక కార్యకలా పాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి ఆరిఫ్ హఫీజ్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇందుకోసం బహత్తర ప్రణాళికలు రూపొందించి, జిల్లా వ్యాప్తంగా ప్రతిపోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని వెల్లడించారు. గత 15 రోజుల్లో గుంటూరు జిల్లాలో 6 గంజాయి కేసులలో 14 మందిని అరెస్ట్ చేసి 4.4 కేజీల గంజాయిని,500 గ్రాముల ద్రవరూప గంజాయిని,రెండు మోటార్ సైకిల్స్, రెండు సెల్ ఫోన్లు, ఒక మారుతి సుజుకి కారును సీజ్ చేసినట్టు తెలిపారు. నగరం పాలెం, తెనాలి, మంగళగిరి, పెదకాకాని పోలీస్ స్టేషన్లో పరిధిలో ఈ కేసులు నమోదు అయినట్టు తెలిపారు.